

వినాయకుని సేవలో ప్రముఖులు

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. - 8లో



అంబేడ్కర్ కృషి మరువలేనిది

భారతరాజ్యాంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. - 8లో



లక్ష పోస్టర్ల ఆవిష్కరణ

బోయకొండలో ఫిబ్రవరి 28 తేదీ నుంచి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఇస్రోకు పలమనేరు డిగ్రీ కళాశాల విద్యార్థిని



చిత్రను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకబృందం

పలమనేరు: పట్టణంలోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన చిత్ర ఇస్రోలో అప్రెంటిషిప్‌నకు ఎంపికైందని ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇదే కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీ) చదువుతున్న చిత్ర గతేడాది ఇస్రో నుంచి వెలువడిన గ్రాడ్యుయేట్ అప్రెంటిషిప్‌నకు దరఖాస్తు చేసుకుందని చెప్పారు. వారు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపడంతో ఆమె అప్రెంటిషిప్‌నకు ఎంపికైనట్టు తెలిపారు. ఇందుకు కారణమైన కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు వెంకటాద్రి, విద్యార్థిని చిత్రను ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించింది. తనకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన కళాశాల అధ్యాపకబృందానికి చిత్ర కృతజ్ఞతలను తెలిపింది.

జిల్లాలో విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,156 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 96, తిరుపతి రూరల్ 45, పుత్తూరు 87, చిత్తూరు అర్బన్ 78, చిత్తూరు రూరల్ 54, మదనపల్లె 65, పీలేరు 44, పుంగనూరు పరిధిలో 57 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 473 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.27 లక్షలు, చౌర్యం కేసులు 53కు గాను రూ.43 వేలు జరిమానాతో కలిపి మొత్తం 526 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.70 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు.

సహకార రంగ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ

చిత్తూరు అగ్రికల్చర్: సహకార రంగ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో ఆ బ్యాంకు మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా సహకార బ్యాంకు ద్వారా రూ.3 వేల కోట్ల మేరకు వ్యాపార లావాదేవీలు నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో రూ.వెయ్యి కోట్ల మేరకు డిపాజిట్లు సేకరణ, రూ.2 వేల కోట్ల వరకు రుణాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించామన్నారు. సహకార బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు విరివిగా రుణాలు అందిస్తునామని చెప్పారు. అనంతరం సహకార బ్యాంకు ఉద్యోగుల సర్వీసు రెగ్యులైజేషన్, ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో హెచ్ఆర్ పాలసీ అమలు తదితర అంశాలను సభలో తీర్మానించారు. బ్యాంకు సీఈఓ మనోహర్‌గౌడ్, జిల్లా సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఓపీ నిబంధనలపై నివేదిక

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్ల పరంగా విద్యుత్ సిబ్బంది సేవల లోపంపై ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు నివేదిక పంపారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వినియోగదారులకు జరిగిన సేవల లోపానికి గాను రూ.22,22,100 మొత్తాన్ని ఏఈల జీతాల నుంచి రికవరీ చేయాలని ఏపీఈఆర్సీకి ఆ శాఖ జిల్లా అధికారులు నివేదికను శుక్రవారం పంపారు. ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) పాటించనందున ఈ మొత్తాన్ని జీతాల నుంచి కట్ చేయాలని నివేదించారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, రిలీజ్ ఆఫ్ న్యూ సర్వీస్, పనుల కోసం అంచనా అని మూడు విభాగాల్లో మొత్తం 2,556 ఫిర్యాదుదారులు పరిహారానికి అర్హులన్నారు.

కుప్పం.. ప్రగతిపథం



ఇది కదా.. అభివృద్ధి

మూడు రాష్ట్రాల కూడలి కుప్పం.. ప్రతిపక్షనేత ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గ కేంద్రం. అయినా మూడు దశాబ్దాలుగా అభివృద్ధి శూన్యం. ఇది నిన్నటి మాట. నేడు కుప్పం స్వరూపం మారిపోయింది. నాడు పాలకుల చిత్తశుద్ధి లేక వెనుకబడిన ఈ పట్టణం నేడు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. నాలుగున్నరేళ్లుగా కుప్పం నయా రూపం సంతరించుకుంటోంది. రైల్వే అండర్ బ్రిడ్జిలు..రోడ్లు.. మురుగునీటి కాలువల నిర్మాణం..ఒకటి కాదు అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోంది.

- నాడు పంచాయతీ.. నేడు మున్సిపాలిటీ
- ప్రత్యేకంగా రూ.66 కోట్ల నిధులు మంజూరు
- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం
- రెండు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం
- రైల్వే స్థలంలో రోడ్డు సమస్య పరిష్కారం

కుప్పం మున్సిపాలిటీ సమాచారం	
వార్డులు	25
ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు	రూ.66 కోట్లు
మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్	రూ. 2 కోట్లు
మురుగునీటి కాలువల నిర్మాణం	15 కిలో మీటర్లు
కాలువల నిర్మాణ వ్యయం	రూ4.5 కోట్లు
సీసీ రోడ్లు	రూ. 7 కోట్లతో 16 కిలో మీటర్లు
పైపులైన్లు	రూ. 2 కోట్లతో 16 కిలో మీటర్లు
నూతనంగా వేసిన బోర్లు	రూ.2 కోట్ల తో 20
మున్సిపాలిటీ పాలన భవనం	రూ. 5 కోట్లతో ఆధునిక భవనం

కుప్పం: గ్రామ పంచాయతీగా ఉన్న కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. వైఎస్సార్ సీసీ పాలనలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. చంద్రబాబు హయంలో మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ చేయడం వృథా అని అప్పటి టీడీపీ నాయకులు కాలం వెళ్లబుచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్పు చేసి అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది.

రూ.5కోట్లతో మున్సిపల్ భవనం



శిథిలావస్థలోని కుప్పం పంచాయతీ భవనం

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తరువాత కుప్పం పంచాయతీ భవనం పరిపాలనకు సరిపోలేదు. దీంతో మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.5 కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మున్సిపాలిటీ పాలనకు అనుకూలంగా ప్రతి శాఖకు ప్రత్యేకంగా చాంబర్లు, పాలక వర్గానికి, సమావేశాలకు అనుకూలంగా భవన నిర్మాణం అత్యంత ఆధునికంగా నిర్మిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, కుప్పం మున్సిపాలిటీ పాలనా వ్యవహారాలు నూతన భవనంలోకి మార్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



రూ.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపాలిటీ భవనం

మున్సిపాలిటీగా రూపాంతరం

రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థ ప్రారంభం నుంచి కుప్పం పంచాయతీగా కొనసాగుతోంది. రోజురోజుకు పట్టణం అభివృద్ధి చెందడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో కమతమూరు, తంబిగానిపల్లె, అనిమిగానిపల్లె, వడ్డిపల్లె, డీకే పల్లె, లక్ష్మీపురం, సామగుట్టపల్లె తదితర గ్రామాలను కుప్పంలో విలీనం చేసి, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని 2014లో అధికారంలోకి వచ్చినా చంద్రబాబుకు అప్పటి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జనవరి 2020లో కుప్పం పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేశారు. అప్పటి నుంచి పట్టణం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

పట్టణంలో 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే గేటు సమస్యకు పరిష్కారం లభించింది. గేటు ఉన్న చోట అండర్ బ్రిడ్జి నిర్మించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న గేటు శాశ్వతంగా మూసివేయాలని 1995లో రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. అప్పటి నుంచి 2004 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం దాన్ని గురించి పట్టించుకోలేదు. అనంతరం 2006లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి స్థానిక నేతలు ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన మరణానంతరం రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎంపీ రెడ్డెప్ప రైల్వే బోర్డు సభ్యుడు కావడంతో అండర్ బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. దీంతో పట్టణంలోని రైల్వేగేటు సమస్య పరిష్కారమైంది.

రోడ్డు సమస్య పరిష్కారం

అపరిష్కృతంగా ఉన్న రైల్వే స్థలంలోని కొత్తపేట రోడ్డు సమస్య పరిష్కారం అయ్యింది. ఈ రోడ్డు కొత్తపేట వాసులకే కాకుండా కుప్పం మండలం పడమర, దక్షిణ దిశగా ఉన్న సుమారు 50 గ్రామాల ప్రజలకు రాకపోకలకు అనువుగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డు కంకర తేలి, గుంతలమయమైనా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ దృష్టికి స్థానికులు ఈ విషయం తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వారు రోడ్డును పునర్నిర్మించి, సమస్యను పరిష్కరించారు.

రూ.15 లక్షలతో చెరువు కట్టపై ఫెన్సింగ్

పట్టణ ముఖద్వారంలోని కుప్పం చెరువు కట్టపై ఫుట్‌పాత్ వెంబడి నడిచి వెళ్లడానికి పాదచారులు ఇక్కట్లు పడేవారు. ప్రమాదవశాత్తు కాలుజారితే నీటిలో పడే ప్రమాదం ఉండేది. ఈ సమస్యను గుర్తించిన నేతలు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో నేడు ప్రజలు చుట్టూ వాకింగ్ చేస్తున్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం





కుప్పం మున్సిపాలిటీ ఏర్పడిన అనంతరం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కుప్పం పట్టణాన్ని 30 ఏళ్లుగా తాగునీటి సమస్య పట్టి పీడిస్తుండేది. 2014–19 వరకు కుప్పం పట్టణంలో నీటి కోసం ప్రజలు నిరంతరం ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారు. అయితే ఆ సమస్యను పరిష్కరించాలని భావించిన వైఎస్సార్ సీపీ నేతలు డీకే పల్లె చెరువు నుంచి పైపులు ద్వారా పట్టణానికి నీటి సరఫరాను నిలిపి వేసి, ప్రతి వార్డులోనూ బోర్లు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చారు. షిఫ్టుల పద్ధతిలో తాగునీటి సరఫరాకు స్వస్తి పలికి, నిత్యం నేరుగా ఇంటికే నీరు అందిస్తున్నారు.



నాడు రైల్వే గేటు సమస్య, నేడు నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జ్



నాడు గుంతలు, కంకర తేలిన రోడ్డు, నేడు కొత్తగా నిర్మించిన రోడ్డు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



“సీఎం జగన్ మోహన్‌రెడ్డి కుప్పం పట్టణాన్ని పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి, రూ.66 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో అపరిష్కృత సమస్యలు కూడా పరిష్కారమయ్యాయి. వసతులు సమకూరుతున్నాయి. సీఎం జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో కుప్పం పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చుదిద్దుతాం.

– సుధీర్, చైర్మన్, కుప్పం మున్సిపాలిటీ

తాగునీటి సమస్య పరిష్కారం



తపారాజ్ వీధిలో ఎప్పుడూ తాగునీటి సమస్యతో సతమతం అయ్యేవాళ్లం. ఖాళీ బిందెలతో పంచాయతీ ఆఫీసు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపేవాళ్లం. రెండేళ్లుగా తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. ఇప్పడు ఇంట్లోకే నీరు వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కరించిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– సరసమ్మ, కుప్పం

కుప్పం మారుతోంది



మున్సిపాలిటీ అయిన తరువాత చేపట్టిన అభివృద్ధితో కుప్పం రూపం మారుతోంది. తాగునీటి సమస్య పరిష్కారం, రైల్వే అండ్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం చెప్పిన మాటను నిలబెట్టుకుని ప్రజలకు న్యాయం చేస్తోంది.

– మురళి, పల్లారిగానిమిట్ట, కుప్పం

జగనన్న రుణం తీర్చుకోలేనిది



పంచాయతీగా ఉన్న కుప్పం పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చి, అభివృద్ధి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. గతంలో ప్రజలను పట్టించుకునే నాథుడే లేరు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడింది. గత ప్రభుత్వం కుప్పం పట్టణంలో తాగడానికి నీరు కూడా ఇవ్వలేదు. నేడు నిత్యం తాగనీరు అందుతోంది.

– చలపతి, చీలేపల్లి, కుప్పం

జగనన్న పాలనలో క్రీడలకు మహర్దశ

- యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
- పుత్తూరులో రూ.78 లక్షలతో స్కేటింగ్ రింగ్
- భూమిపూజ చేసిన మంత్రి రోజా



స్కేటింగ్ రింగ్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్రీడలకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం పుత్తూరులోని మరాఠీగేట్ సమీపంలో శాప్ నిధులు రూ.78 లక్షలతో స్కేటింగ్ రింగ్ నిర్మాణానికి మంత్రి రోజా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న విద్యారంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, క్రీడలకూ అంతే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇందుకు ఇటీవల ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా పోటీలే నిలువెత్తు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసి, వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి, ఇటు రాష్ట్రం, దేశం గర్వపడేలా పోటీతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మైదానాలు, క్రీడా సామగ్రిని ప్రభుత్వం సమకూరుస్తోందని తెలిపారు. జగనన్నను ఆదర్శంగా తీసుకునే తానూ నగరి నియోజకవర్గంలో రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రాల్లో క్రీడా జిమ్‌లు, స్కేటింగ్ రింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పుత్తూరులో స్కేటింగ్ రింగ్ ఏర్పాటుకు స్థల సేకరణ నుంచి నిధులు మంజూరు వరకు పోరాడి సాధించినట్లు తెలిపారు. సీఎం జగనన్న సహకారంతో నగరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్ సయ్యద్‌సాహెబ్, డీఓ బాలాజీ, ఆర్అండ్‌బీ డీఈఈ అమర్‌నాథ్‌రెడ్డి, ఏఈఈ గిరీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, ఆలయ కమిటీ చైర్మన్లు రమేష్‌బాబు, మనోహర్ రెడ్డి, ఎంఎల్ఓ దిలీప్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు బాలసుబ్రమణ్యం, ఏకాంబరం, వైఎస్సార్‌సీపీ నాయకులు జయబాబు, ఈశ్వరయ్యయాదవ్, జయరామ్‌రెడ్డి, చక్రి, ప్రసాద్, వెంకటేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన నెమలి



బీట్ అధికారి రెడ్డెప్పకు నెమలిని అందజేస్తున్న ఏఎస్ఐ సుజాత

ఐరాల: తవణంపల్లె మండలం ఈచనేరి సమీపంలో రోడ్డుపై ఓ నెమలి గాయపడి ఉండడాని కాణిపాకం ఆలయానికి వెళుతున్న భక్తులు గమనించి కాణిపాకం పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. ఈ విషయాన్ని పోలీసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సంత పేట బీట్ అధికారి రెడ్డెప్ప, అసిస్టెంట్ బీట్ అధికారి ఉదయకుమార్‌కు ఏఎస్ఐ నెమలిని అప్పగించారు. గాయపడిన నెమలికి ప్రథమ చికిత్స నిమిత్తం చిత్తూరు వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం నెమలిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదులుతామని బీట్ అధికారి రెడ్డెప్ప తెలిపారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి



సుబ్రమణ్యం (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): తేనెటీగల దాడిలో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వడ్డెగుడెసెలు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెనుమూరు మండలంలోని వడ్డెగుడెసెలు గ్రామానికి చెందిన వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్ తండ్రి సుబ్రమణ్యం(70) గురువారం తమ పొలం వద్దకు వెళ్లారు. ఆ ప్రాంతంలో వెళుతున్న తేనెటీగల గుంపు ఆయనపై దాడి చేసి, కుట్టాయి. దీంతో ఆయన ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం తెలిపాడు. వారు హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించి, ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం సుబ్రమణ్యం అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు మళ్లీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

వర్చువల్‌లో విగ్రహావిష్కరణను వీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



అంబేడ్కర్ కృషి మరువలేనిది

చిత్తూరు కలెక్టరేట్ : భారతరాజ్యాంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. విజయవాడలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో వీక్షించారు. తొలుత కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ షణ్మోహన్, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పడం ఆనందకరమన్నారు. సామాజిక న్యాయ మహాశిల్పాన్ని సీఎం జాతికి అంకితం చేశారని తెలిపారు. విద్య, ఆర్థిక, రాజకీయ సాధికారతతో బడుగులు, మహిళలు రాణిస్తున్నారని చెప్పారు. పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల పట్టాల కసరత్తు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జర్నలిస్టుల ఇళ్ల పట్టాల కసరత్తు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇళ్ల పట్టాల మంజూరు అంశంపై జిల్లాస్థాయి కమిటీతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు నిబంధనల మేరకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ జీఓ మేరకు క్షేత్రస్థాయిలో కసరత్తు నిర్వహిస్తునట్లు చెప్పారు. 3 సెంట్ల మేరకు ఇళ్ల స్థలాలను ఇస్తామన్నారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి గడువులోపు దరఖాస్తు చేసుకున్న 301 మందితో కూడిన జర్నలిస్టుల ప్రాథమిక జాబితా రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం నుంచి జిల్లాకు వచ్చిందన్నారు. ప్రాథమిక జాబితా ప్రకారం ఆయా మండలాల్లో తహసీల్దార్లు పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ నెల 23వ తేదీ తదుపరి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. డీఆర్వో రాజశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్లు మురళీమోహన్, బాబురాజేంద్రప్రసాద్, డీఐపీఆర్వో పద్మజ, సభ్యులు సహదేవ, సయ్యద్ అక్రం, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన పోస్టర్ల ఆవిష్కరణ



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి, నాగరాజారెడ్డి, చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఫిబ్రవరి 28 తేదీ నుంచి మూడు రోజులపాటు లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంపతులిద్దరూ రూ.1500 చెల్లించి, లక్షకుంకుమార్చన సేవలో పాల్గొనవచ్చన్నారు. అలాగే ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సమావేశం నిర్వహించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాలకమండలి సభ్యుడు రాజేష్, భాస్కర్‌రెడ్డి, భారతి, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయానికి మామిడి, వేప ఆకు, పూల తోరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆ ధ్వర్యంలో రాహుకాల సమయంలో అభిషేక పూజలు చేశారు. మహిళలు అధికసంఖ్యలో ఉపవాస దీక్షలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉభయకర్తలకు చైర్మన్, ఈఓ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఉచిత అన్న ప్రసాద నిర్వహణకు పలమనేరుకు చెందిన సీఎస్ నవీన్ కుమార్ బృందం కూరగాయలు వితరణ చేశారు.

ఆడపిల్లలు లేని సమాజం అనాథతో సమానం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు రూరల్: ఆడపిల్లలు లేని సమాజం అనాథతో సమానమని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మహిళ సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలు అని తెలిసిన వెంటనే అబార్షన్ చేయించుంటున్నారని చెప్పారు. ఆడపిల్లలే సృష్టికి మూలకారణమన్నారు. బాల్య వివాహలపై అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలను రక్షించాలని చెప్పారు. క్షేతస్థాయిలో వైద్యబృందం దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.3 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న సినీ డైరెక్టర్ ఆకుల శివ

కార్వేటినగరం: తన తల్లి ఆకుల మునిలక్ష్మమ్మ జ్ఞాపకార్థం సీడీ కండ్రిగ పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.3 లక్షలు వితరణ చేసినట్లు ఆమె కుమారుడు, ప్రముఖ సినీ డైరెక్టర్ ఆకుల శివ తెలిపారు. సీడీ కండ్రిగ పంచాయతీ పరిధిలోని వడ్డిండ్లలో ఉన్న మొగిలమ్మ ఆలయాభివృద్ధికి శుక్రవారం ఆయన రూ. 20 వేలు ఆ గ్రామస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శివ మాట్లాడుతూ తన తండ్రి ఆకుల సుబ్రమణ్యం సర్పంచ్‌గా పంచాయతీ అభివృద్ధికి 30 సంవత్సరాలు సేవలు చేశారని గుర్తు చేశారు. అదే బాటలో తమ కుటుంబం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తరపున నేటికీ ఎనలేని సేవలు అందిస్తుందని తెలిపారు. అలాగే సినీ పరిశ్రమ ద్వారా ఆర్థికంగా ఎదిగిన తాను కూడా టీకేఎం పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టీకేఎం పేటలోని పెద్దపులి గంగమ్మ, ముత్యాలమ్మ ఆలయాల అభివృద్ధికి ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షలు నగదును అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఆకుల మునిలక్ష్మమ్మ కుటుంబం గ్రామాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడంలో ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, సర్పంచ్ ఆకుల మంగమ్మ, ఆకుల రాజగోపాల్, ఆకుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ బోర్డు ధ్వంసం



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఐరాల: మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డు పాక్షికంగా ధ్వంసం చేసినట్లు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కథనం మేరకు.. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు రాము టైల్స్ షాపు వద్ద మా నమ్మకం నువ్వే జగన్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బోర్డును పాక్షికంగా ధ్వంసం చేశారు. ఉదయం షాపు వద్దకు వెళ్లి పరిశీలించిన ఆయన, బోర్డు ధ్వంసం అయిన విషయం గుర్తించారు. ఈ విషయమై ఆయన వైఎస్సార్ సీపీ నేతలతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. విచారణలో వారి వెనుక ఎవరు ఉన్నారనేది తెలియాల్సి ఉందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి



నవదీప్(ఫైల్)

వి.కోట: హాస్టల్‌లో చదువుతూ సంక్రాతి సెలవులకు ఇంటికి వచ్చిన బాలుడు అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, యువసైన్యం సభ్యుడు మురళి కుమారుడు నవదీప్ (11) గ్యారంపల్లె హాస్టల్‌లో ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం ఏమి జరిగిందో ఏమో అకస్మాత్తుగా నవదీప్‌కు ఊపిరాడక పోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు వి.కోట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో వాంతులు చేసుకున్నాడు. ఆస్పత్రిలో బాలుడిని వైద్యులు పరిశీలించి, నవదీప్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నాగిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకుని మృతునికి నివాళులర్పించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

వినాయకుని సేవలో ప్రముఖులు



సినీ నటుడు చరణ్‌రాజ్‌తో ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామి వారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే, ప్రముఖ సినీ నటుడు చరణ్‌రాజ్ స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్, సీఐ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం కేసులో మహిళ అరెస్టు



నిందితురాలిని అరెస్టు చూపుతున్న సీఐ ఎల్లయ్య, సిబ్బంది

పలమనేరు: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి, ఆమె నుంచి 480 టెట్రా ప్యాకెట్ల విస్కీని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎల్లయ్య శుక్రవారం తెలిపారు. సెబ్‌సీఐ కథనం మేరకు.. పలమనేరు సెబ్ పరిధిలోని కస్తూరినగరం వద్ద సెబ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్ణాటక నుంచి మద్యం తీసుకుని వస్తున్న సుశీల(47)ను అనుమానించి, తనిఖీ చేయగా ఆమె వద్ద 480 టెట్రా ప్యాకెట్ల విస్కీ ఉండడంతో గుర్తించి, దాన్ని స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. ఆమెతోపాటు ఉన్న మరో నిందితురాలు పరిమళ(31) పరారీ అయ్యింది. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

6కిలోల గంజాయి పట్టివేత



గంజాయి విక్రేతను అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: విశాఖపట్నం నుంచి గంజాయి దిగుమతి చేసుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న మహిళను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ వివరాలను ఇన్‌చార్జి సీఐ ఉలసయ్య వెల్లడించారు. గంజాయి విక్రయాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో కట్టమంచి బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న పెనుమూరు మండలం పూనేపల్లెకు చెందిన షాహిన (35) విశాఖపట్నం నుంచి భారీగా గంజాయి దిగుమతి చేసుకుని చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, చిత్తూరు పాత బస్టాండ్, గంగినేని చెరువు, పీవీకేఎన్ కళాశాల ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో షాహినను అరెస్టు చేసి, ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొంత మందిని కూడా అరెస్టు చేయనున్నట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, భారతి పాల్గొన్నారు.

నీలగిరి వృక్షాల నరికివేతపై ఫిర్యాదు

శాంతిపురం: ప్రభుత్వ భూమిలోని నీలగిరి(కర్పూరం)వృక్షాలను అక్రమంగా నరికివేశారని శివరామపురం సర్పంచ్ పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శి రాధిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.శాంతంపల్లె రెవెన్యూలోని సర్వే నంబర్ 23/8లో ఉన్న వృక్షాలను కొందరు వ్యక్తులు నరికి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 150 వృక్షాలను అక్రమంగా నరికి తరలించినట్టు వారు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ తెలిపారు.

సారా స్వాధీనం



అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: యాద మరి మండలంలో శుక్రవారం ఎస్ఈబీ అధికారులు సారా స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రంగనాయక చెరువు వద్ద సారా విక్రయిస్తున్న ఆర్ముగం (48) అనే వ్యక్తిని అరెస్టు చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

Indian Bank ఇండియన్ బ్యాంక్ | బిగువమాఘం శాఖ, అమరరాజ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, అరగొండ రోడ్డు, బిగువమాఘం, తవణంపల్లి మండలం, ఫోన్ : 9329468432

స్థిరాస్తులు విక్రయమునకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా "ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)"లకు నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటార్‌కు తనఖా పెట్టిన / ఛార్జీ చేసిన దిగువ తెలిపిన స్థిరాస్తులను ఇండియన్ బ్యాంక్, బిగువమాఘం శాఖ (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్న సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా తేది.21-02-2024 న అస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.

ఋణగ్రహీత మరియు తనఖాదారు : మెస్సర్స్ యస్.బాబు పౌల్ట్రీ ఫామ్, ప్రొప్రయిటర్ : శ్రీ యస్.బాబు, తండ్రి : శ్రీ యస్.సుబ్రమణ్యం చెట్టి, 1-280, భజన గుడి వీధి, తవణంపల్లి గ్రామం & పోస్టు, తవణంపల్లి మండలం, చిత్తూరు జిల్లా-517131.
హామీదారు మరియు తనఖాదారు: శ్రీమతి యస్.కుమారి, భర్త: యస్.బాబు, 1-280, భజన గుడి వీధి, తవణంపల్లి గ్రామం & పోస్టు, తవణంపల్లి మండలం, చిత్తూరు జిల్లా-517131 హామీదారు : శ్రీ యస్.పురుషోత్తం, తండ్రి : ధర్మలింగం చెట్టి, 1-289, భజన గుడి వీధి, తవణంపల్లి గ్రామం & పోస్టు, తవణంపల్లి మండలం, చిత్తూరు జిల్లా-517131

వేలం బిడ్ ఫారం మరియు నియమ నిబంధనల కొరకు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC Ltd వారి వెబ్‌సైట్ (www.mstcecommerce.com) నందు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహా ఇవ్వబడమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ నెంబర్ 033-22901004, 033-23400020/23400021/23400022 మరియు సర్వీస్ ప్రొవైడర్స్ వద్ద లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించండి. MSTC Ltd తో రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి ibapiop@mstcecommerce.com ను మరియు EMD స్టేటస్ కోసం ibapifin@mstcecommerce.com ను సంప్రదించవచ్చును.ఆస్తి వివరాలు మరియు ఆస్తి యొక్క ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.in ను సందర్శించగలరు. ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణల కోసం దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్. 18001025026 మరియు 011-41106131 ను సంప్రదించండి. https://ibapi.in మరియు www.mstcecommerce.com వెబ్‌సైట్‌లో ఆస్తి కోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్లను చూడగలరు.

తేది : 19.01.2024, ప్రదేశం : బిగువమాఘం — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్